సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం, 19, మే, 2023



పాడి దిగుబడిపై వడదెబ్బ!

వేసవి తీవ్రతకు పాడి పశువులు అల్లాడిపోతున్నాయి. దీని ప్రభావం పాల దిగుబడిపై చూపుతోంది. 8లో



'మత్తు' ముఠా.. ఆటకట్టు 8లో

నిషేధిత మత్తు ఇంజక్షన్లు విక్రయాలకు సంబంధించి వేర్వేరు కేసుల్లో పోలీసులు, సెబ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు.



టిప్పర్ బోల్తా.. ఒకరికి గాయాలు

రోడ్డు నిర్మాణ పనులకోసం వెళుతున్న ఒక టిప్పర్ గురువారం సంపంగిగొంది వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. 8లో

న్యూస్‌రీల్

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: మండలంలోని ఏపీ గిరిజన సంక్షేమశాఖ గురుకుల (పీటీజీ)బాలుర పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 3వ తరగతిలో 80, 4వ తరగతిలో 14, 7వ తరగతిలో 1, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 4 చొప్పున మొత్తం 104 సీట్లు ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

20న ప్లస్ టూ స్కూళ్ల పీజీటీలకు కౌన్సెలింగ్

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలోని హైస్కూల్ ప్లస్-2 స్కూళ్లలో పీజీటీలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించేందుకు ఈ నెల 20న ఉదయం 11గంటలకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శుక్రవారం కౌన్సెలింగ్ అని ప్రకటించామని, అయితే దీనిని 20కు మార్పు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ మార్పును గమనించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం విశాఖ డీఈవో కార్యాలయంలో ఉంటుందన్నారు.

21న అఖిలభారత ఆదివాసీ సదస్సు

డాబాగార్డెన్స్: దేశంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజనులపై పెరుగుతున్న దాడులు ఎదుర్కొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులతో ఈ నెల 21న విశాఖలో అఖిలభారత ఆదివాసీ సదస్సు నిర్వహించనున్నట్టు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ప్రతినిధులు కేదార్ సబర(ఒడిసా), డి సురేష్, ముక్తి సత్యం (తెలంగాణ) తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మా భూమి, జీవనోపాధిని, మా అస్తిత్వాన్ని కాపాడుకోవడం, విస్థాపన లేని అభివృద్ధిని, అడవులను రక్షించుకోవడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆదివాసీ సమూహాలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో సదస్సులో పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న జాతీయ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, బీహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మణిపూర్ నుంచి ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు 750 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నట్టు తెలిపారు.

రేపు ఏయూ-ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ నెల 20న ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏయూ సెనేట్ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ రీసెర్చ్-డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి రామ్ కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్ అందించే స్టార్టప్ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు వివరిస్తారు. విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు పరిశోధన ప్రాజెక్టులు అందించే అంశాలపై చర్చిస్తారు. హైడ్రో కార్బన్ రంగంలో నూతన స్టార్టప్‌లను సాధించే దిశగా అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పాల్గొంటారు. పూర్తి వివరాలకోసం ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తంను 9599229217 నంబరులో సంప్రదించాలి.

ఫణిభూషణ్ శ్రీధర్‌కు మరో పురస్కారం


అనకాపల్లిటౌన్ : పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌కు రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు వరించింది. జీవ వైవిధ్యంపై విత్తన బ్యాంకుల ఏర్పాటు, విత్తన బంతులు, జీవ వైవిధ్య రిజిస్టర్ల తయారీ, జీవ వైవిధ్య సంరక్షణ, ఔషధ మొక్కల యూనిట్ల ఏర్పాటు, పంపిణీ, పక్షుల గూళ్లు, ఉచితంగా పక్షులకు తిండి గింజలు, తాగునీటి మట్టిపాత్రల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు గాను ఈ పురస్కారం దక్కింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న తిరుపతి వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో శ్రీధర్ ఈ అవార్డు అందుకోనున్నారు. అవార్డు ప్రదానోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, పర్యావరణ, అటవీశాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టూరిజం శాఖ మంత్రి కె.రోజాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యే వేదికపై, వారి చేతుల మీదుగా శ్రీధర్ అవార్డు అందుకోనున్నారు.

కౌలుకు కళ్లెమేదీ?

- గణనీయంగా పెంచేసిన ధరలు
- మిర్చి రేటు పెరగడమే కారణం
- చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు



మిరప కాయల గ్రేడింగ్‌లో రైతులు



నందిగామలో కౌలు భూముల్లో మిరప సాగు

ఎటపాక: సాగు భూముల కౌలు ధరలకు రెక్కలొచ్చాయి. ఎన్నడూ లేనివిధంగా కౌలు ధరలను అమాంతం పెంచేస్తుండటంతో చిన్న, సన్నకారు రైతులకు కౌలుకు భూములు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది.

70 శాతం మంది..

ఎటపాక ప్రాంతంలో రైతుల్లో 70 శాతం మంది కౌలుకు భూములు తీసుకుని సాగు చేస్తుంటారు. నాలుగు మండలాల్లో రబీ, ఖరీఫ్ సీజన్లలో 30 వేల ఎకరాల్లో సుమారు 11,400 మంది రైతులు వరి, పత్తి, మిర్చి, అపరాల పంటలు వేస్తారు. ప్రధాన వాణిజ్య పంట మిర్చిని అధికశాతం రైతులు సాగు చేస్తున్నారు. వీఆర్‌పురం, ఎటపాక, కూనవరం మండలాల్లో మిర్చి సాగు అధికంగా ఉంటుంది. మిర్చి సాగుకు ఎక్కువ మంది గిరిజనేతర రైతులు భూములను కౌలుకు తీసుకుంటారు. ఎటపాకలోని నెల్లిపాక నుంచి మురుమూరు మధ్య గ్రామాల్లోనే వేలాది ఎకరాల్లో ఏటా మిర్చి సాగవుతోంది.

కౌలు ధరలకు రెక్కలు

మిర్చికి ఈ ఏడాది ఊహించని విధంగా ధర పెరిగింది. దీని ప్రభావం రానున్న వ్యవసాయ సీజన్‌లో సాగు భూములపై చూపనుంది. ఈక్రమంలోనే ఎన్నడూ లేనివిధంగా కౌలు ధరలు కూడా విపరీతంగా పెంచేశారు.

- గత ఏడాది ఎకరా కౌలు ధర గోదావరి పరివాహక ప్రాంతంలో రూ.15 వేల నుంచి రూ.25 వేలు, వాగుల లంక భూములు (నల్లరేగడి) రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఉండేది. అయితే ఈఏడాది ఇవే గొమ్ము (గోదావరి)భూములు ఎకరానికి గత ఏడాది కంటే అదనంగా రూ.25వేల నుంచి రూ.45 వేల వరకు పెంచేశారు.
- నల్లరేగడి భూములు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచేశారు. దీంతో రెండు లేదా మూడు ఎకరాలు సాగుచేసే రైతులు భూములను కౌలుకు తీసుకునే పరిస్థితి లేదు.
- ధరలు అధికంగా పెంచడంతో చాలామంది మంది గిరిజన, గిరిజనేతర సన్న,చిన్న కారు రైతులు వ్యవసాయానికి దూరం కానున్నారు. కౌలు ధరలు పెరగడానికి మిర్చి సాగు చేసే పెద్ద రైతులు పోటీపడటమే అనే వాదనలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది కూడా మిర్చికి మంచి ధర వస్తుందనే ఆశతోనే కౌలు ధరలు అమాంతం పెంచేసారన్న చర్చ సాగుతోంది.

పరిహారం పొందిన భూములే ఎక్కువ

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపునకు గురయ్యే భూములను గుర్తించి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించింది. ఆ భూములకు కూడా కౌలు విపరీతంగా పెంచారు. తోటపల్లి నుంచి నందిగామ వరకు వందలాది ఎకరాల భూములు భూస్వాములకు చెందినవే. వారంతా భద్రాచలం, రాజమండ్రి తదితర ప్రాంతాలకు దశాబ్దాల క్రితమే నివాసం వెళ్లిపోయారు. వీరంతా భూనష్టపరిహారం పొందినప్పటికీ ఆ భూములను ఇక్కడి రైతులకు కౌలుకు ఇస్తున్నారు.

ధర పెరిగిందన్న సాకుతో..

ఈ ఏడాది మిర్చి పంటకు ధర పెరిగిందనే సాకుతో వారి భూములకు కౌలు రెట్టింపు చేయడానికి కారణమని వినవస్తోంది. కొందరు రైతులను అడ్డంపెట్టుకుని వారి మధ్య పోటీ సృష్టించి ధరల పెరుగుదలకు ఆజ్యం పోస్తున్నారు.

ధరలు తగ్గించాలి



కొందరు భూస్వాములు కౌలు ధరలను ఇష్టానుసారంగా పెంచేయడంతో సన్న, చిన్నకారు రైతులు అంత కౌలు చెల్లించి భూములు తీసుకునే పరిస్థితి లేదు. రైతుల మధ్య పోటీ కౌలు ధరల పెంపునకు కారణం. ధరలు తగ్గించాలి.

– ఆకుల నాగేంద్రరావు, గొరిదేవిపేట, రైతు

మన్యంలో కొలువుదీరనున్న శ్రీనివాసుడు

- 22న ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- టీటీడీ ఎగ్జిక్యుటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి
- 21 వరకు మహా సంప్రోక్షణ



హోమం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

రంపచోడవరం: మండలంలో ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని మెట్టపై కలియుగదైవం శ్రీనివాసుడు కొలువుదీరనున్నారు. ఈమేరకు ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యుటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన ప్రాంత ప్రజలకు వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు లభించేలా ఈనెల 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన మహా సంప్రోక్షణ 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మరుసటిరోజు 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తామని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవానికి భక్తులు హాజరు కావచ్చని ఆయన తెలిపారు. ఆలయ ప్రారంభంపై టీటీడీ ఏర్పాటు చేసిన వాహనం ద్వారా ఈనెల 17నుంచి గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో..

మహా సంప్రోక్షణలో భాగంగా టీటీడీ అర్చకులు వేద మంత్రాల మధ్య హోమం, పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంచగవ్యప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమాలు జరిగాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీఈ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి కంప్యూటర్లు అందించిన హెటిరో

సీఎస్ఆర్‌లో భాగంగా పంపిణీ



కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో హెటిరో చైర్మన్ పార్థసారథి

అనకాపల్లిటౌన్ : నక్కపల్లి హెటిరో సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి 10 డెస్క్‌టాప్ కంప్యూటర్లను అందించింది. వీటిని ఎస్పీ కె.వి. మురళీకృష్ణకు సంస్థ చైర్మన్ బండి పార్థసారధి వీటిని అందించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ జిల్లా పోలీసులకు పాలనాపరమైన అవసరాలకు ఉపయోగపడేలా ఈ కంప్యూటర్లను ఇచ్చినట్టు పేర్కొన్నారు. వీటి కోసం సీఎస్ఆర్ నిధులు రూ.6.50 లక్షలు కేటాయించామన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు వీటిని అందిస్తామని, ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్, కంపెనీ ప్రతినిధులు ప్రభాకర్, కుల్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఈనెల 20వ తేదీన నిర్వహణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లో ఐదవ తరగతి, రాష్ట్రంలోని పలు గురుకుల కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు, విజయనగరం జిల్లా తాటిపూడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.వి.రాజేంద్రప్రసాద్‌ను పరీక్షల సమన్వయకర్తగా నియమించినట్లు ఆయన తెలిపారు జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా పర్యవేక్షణలో ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి 494 మంది, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 1132 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాడేరు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలోని రెండు కేంద్రాల్లో, ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఆ రెండు సెంటర్లతో పాటు, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) కేంద్రాల్లో జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందని, ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందు అభ్యర్థులు సంబంధిత పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

ముంపు బాధితులకు అన్నివిధాలా సహకారం

పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య



మాట్లాడుతున్న పోలవరం పరిపాలన అధికారి ప్రవీణ్ ఆదిత్య

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రంపచోడవరం, చింతూరు డివిజన్లలో పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితుల సమస్యలపై ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ముంపు బాధితులకు కేటాయించిన భూమి అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, వివిధ రకాల వ్యాపారాలకు అవసరమైన సహకారంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురై ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఉంటున్న 5,800 గిరిజన కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టులో ముంపునకు గురైన బాధిత గిరిజనులకు భూమికి భూమి ఇస్తామని చెప్పారు. వాటిలో రైతులు నచ్చిన పంటలు వేసుకునేలా సహకారం అందిస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో భూమి అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఉన్నవారికి ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసకుంటామని చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నివాసముంటున్న గిరిజన రైతులకు సాగునీరు ఉన్నది లేనిది సర్వే చేసి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాల వివరాలతో యాక్షన్ ప్లాన్ సమర్పించాలని సూచించారు. ముంపునకు గురైన ఐదు వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన 100 కుటుంబాలకు ఒక అధికారిని సర్వేకు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతీ యువకులకు ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించేలా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు అరకులోయలో మెగా జాబ్ మేళా

పోస్టర్ ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ ,ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: ఈనెల 19వతేదీ శుక్రవారం అరకులోయ ఆర్ఐటీఐ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహణకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిలో భాగంగా గురువారం మెగా జాబ్‌మేళా ప్రచార పోస్టర్‌ను కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏలో పీవో వి.అభిషేక్ ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు, పేటీఎం సర్వీస్, మదర్ అండ్ ఫాదర్ హోం నర్సింగ్ సర్వీసెస్, మోహన్ స్పిన్‌టెక్స్, డెక్కన్ కెమికల్స్, భారత్ ఎఫ్‌ఐహెచ్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, ముత్తూట్ ఫైనాన్స్ ,వైఎస్‌కే ఇన్ఫోటెక్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. టెన్త్ ఆపై చదువులు, టెక్నికల్ కోర్సులు చదివిన యువతీ యువకులు ఈజాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య కేంద్రం పరీక్షల నోటిఫికేషన్ విడుదల



ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నుంచి నిర్వహించే యుజి, పి.జి, ప్రొఫెషనల్, డిప్లమా, పీజీ డిప్లమా, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం ఇంచార్జి సంచాలకులు ఎం.వి.ఎస్ చంద్రశేఖర రావు తెలిపారు. 2020–21, 2021–22, 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన వారు 2017–18 విద్యా సంవత్సరం తరువాత చేరిన బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ 500 అపరాధ రుసుంతో జూన్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. రూ.2000 అపరాధ రుసుముతో జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. పరీక్షలకు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.andhrauniversity.sde. com , 0891 2844163, 2844164,2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల తేదీలు

డిగ్రీ మూడో సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ మూడో సంవత్సరం పరీక్షలు జూలై 3వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 3వతేదీ నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం యూజీ, పీజీ, డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు జూలై 18 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

కార్మికుల భద్రత తప్పనిసరి

- వేసవి నేపథ్యంలో యాజమాన్యాలు జాగ్రత్తలు చేపట్టాలి
- జిల్లా కార్మికశాఖ అధికారి సుజాత



సాక్షి,పాడేరు: వేసవి తీవ్రత నేపథ్యంలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని కార్మికశాఖ జిల్లా అధికారి టి.సుజాత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నెలకొన్న నేపథ్యంలో కార్మికుల సంక్షేమానికి తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సేవా రంగాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, నిర్మాణరంగం, ఇటుక పరిశ్రమలు, కర్మాగారాల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే కార్మికులకు వేసవికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్టు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికుల పనివేళలను ఉదయం, సాయంత్రం సమయాలకు మార్పు చేయాలని సూచించారు. కార్మికులు పనిచేసే ప్రాంగణంలో తాగునీటి సదుపాయం, నీడ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించినట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో కార్మికులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. వడదెబ్బకు గురైనప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన ఔషధాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు.

సమ్మర్ సరదా..



తాటి కాయలు తీసుకువస్తున్న చిన్నారులు



ఈత కాయల సేకరణలో చిన్నారులు

ఎటపాక: సమ్మర్ సరదాల్లో చిన్నారులు మునిగిపోయారు. తోటి స్నేహితులతో కలిసి పల్లెల్లో ఆటపాటలతో ఆనందాలు పంచుకుంటున్నారు. వేసవిలో దొరికే ఈత పండ్లు,తాటి ముంజలు వేటలో నిమగ్నమయ్యారు. స్నేహితులతో కలిసి ఈత చెట్లు ఎక్కి పండ్లు కోసి వాటిని పంచుకుని తింటున్నారు. తాటి కాయలు తెచ్చుకుని చెట్ల నీడలో కూర్చుని తింటున్నారు.

మారేడుమిల్లిలో భారీ వర్షం



సోమిరెడ్డిపాలెం వీధిలో షెడ్డుపై కూలిన చెట్టు



మారేడుమిల్లిలో కురుస్తున్న వర్షం

- కూలిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

మారేడుమిల్లి : మండల కేంద్రమైన మారేడుమిల్లిలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల సేపు వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు కూలాయి. స్థానిక సోమిరెడ్డిపాలెం వీధిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద భారీ చెట్టు కూలడంతో షెడ్డు దెబ్బతింది. విద్యుత్ వైర్లు తెగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. అనంతరం విద్యుత్ సిబ్బంది లైన్లు సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. ఒక్కసారిగా వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు.

పిడుగుపాటుకు రెండు పశువుల మృతి

అనంతగిరి: మండలంలోని పిడుగుపాటుకు రెండు పశువులు మృతిచెందాయి. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా పిడుగులతో భారీ వర్షం కురిసింది. కోనపురం పంచాయతీ బొందుగుడ గ్రామానికి చెందిన పూజారి కొండు, మరో గిరిజనుడికి చెందిన రెండు పశువులు పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాయి. పశువుల మృతితో బాధిత రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

టిప్పర్ బోల్తా.. ఒకరికి గాయాలు

గూడెంకొత్తవీధి: రోడ్డు నిర్మాణ పనులకోసం వెళుతున్న ఒక టిప్పర్ గురువారం సంపంగిగొంది వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు గాయపడినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు వారు పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

చింతపల్లి రూరల్ : మతిస్థిమితం లేని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నవరం ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. మండలంలోని లోతుగడ్డ పంచాయితీ చెరపల్లి గ్రామానికి చెందిన నామల నర్సింగరావు (42) కొనేళ్లుగా మతిస్థిమితం కోల్పోయాడని, ఈ క్రమంలో ఈ నెల 12న గ్రామం వద్ద నున్న కొండపైకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడన్నారు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి కమలమ్మ పోలిసులకు బుధవారం ఫిర్యాదు చేసిందన్నారు. గురువారం కొంతమంది గ్రామస్తులు కట్టెల కోసం అడవికి వెళ్లగా చెట్టుకి ఉరివేసుకుని నర్సింగరావు కనిపించాడు. వెంటనే వారు అన్నవరం పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు ఎస్ఐ సాయి కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కోటవురట్ల: నర్సీపట్నం మండలం ధర్మసాగరానికి చెందిన జోగ లోవ నక్కపల్లి మండలం వేంపాడు నుంచి పల్సర్ బైక్ వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం అర్ధరాత్రి సుంకపూరు జంక్షన్‌కు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నల్లమారమ్మ తల్లి ఆలయంలో వద్ద సిమెంట్ దిమ్మను వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

'మత్తు' ముఠా.. ఆటకట్టు

- నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్
- మిగిలిన వారి కోసం పోలీసుల గాలింపు
- భారీ సంఖ్యలో ఇంజక్షన్లు స్వాధీనం

అల్లిపురం: ప్రత్యేక పరిస్థితుల్లో.. వైద్యుల సూచన మేరకు మాత్రమే వినియోగించాల్సిన మత్తు ఇంజక్షన్లు నగరంలో కొంత మంది విక్రయిస్తుండటంతో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. నిషేధిత మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ.. అరెస్టులు చేస్తున్నారు. తాజాగా వేర్వేరు కేసుల్లో టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సెబ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఈ వివరాలు వెల్లడించారు. సమావేశంలో డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు, క్రైం డీసీపీ జి.నాగన్న పాల్గొన్నారు.

- కోల్‌కతా నుంచి పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు మధ్యవర్తుల ద్వారా గుంటు ఉమామహేష్ రూ.40కి కొనుగోలు చేసి.. నగరంలో రూ.60 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం మేరకు సీతమ్మధార, పెందుర్తి సెబ్ అధికారులు దాడులు చేసి సీతమ్మధార కనకపువీధిలో 3 వేల మత్తు జంక్షన్లతో 60 బాక్సులను ఉమామహేష్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కోల్‌కతాకు చెందిన బీమాల్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీపీ తెలిపారు.
- పీఎంపాలెం, మధురవాడలో 100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లతో రెండు బాక్స్‌లను నిందితుడు బెవర వెంకటేష్ నుంచి పెందుర్తి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఖరగ్‌పూర్‌కు చెందిన దుర్గాప్రసాద్ ఈ ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నాడు. ఇటీవలే అతన్ని మహారాణిపేట, గోపాలపట్నం పోలీసులు రెండు కేసుల్లో అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అతను బెయిల్‌పై విడుదల అయినట్లు తెలిపారు.
- సీతమ్మధార, పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడిన 14 మందిని అదుపులోకి తీసుకుని.. 'మార్పు' సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేక్వార్టర్స్‌లో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు దాడి చేశారు. నిందితుడు కాళ్ల హరి పద్మ రాఘవరావు, పబ్బితి రవి, కాకటా చిరంజీవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 42 బాక్సుల్లోని 2,100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు, 21 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసులో పితాని అప్పలరాజ అలియాస్ చిన్నా, పితాని రవి, శ్యామ్, వానపల్లి జగదీష్‌లకు అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. వీరికి బీమాల్ కండేవాలా మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కాళ్ల హరి పద్మ రాఘవరావు అలియాస్ భీమిలి హరిపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో 5, గోపాలపట్నం సెబ్‌లో ఒకటి, రాజమండ్రి వన్‌టౌన్ పీఎస్‌లో ఒకటి, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. పబ్బిత్ రవికుమార్‌పై టూటౌన్, ఎంవీపీ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు.

7,546 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో 2019 జనవరి 1వ తేదీ నుంచి 2023 మే 17వ తేదీ వరకు 191 కేసుల్లో 7546.23 కిలోల గంజాయి, 27.4 కిలోల గంజాయి ఆయిల్(హషీష్ ఆయిల్)ను స్వాధీనం చేసుకుందని సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ కేసుల్లో 473 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాల నియంత్రణలో సెబ్ పనితీరును ఆయన వివరించారు. 257 మంది గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిలో 200 మందిని అరెస్ట్ చేశామని, 49 మందిని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చామని వెల్లడించారు. మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనూప్ అధికారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మత్తు మందులకు దూరంగా ఉండాలని నగరంలో 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మత్తు మందుల వినియోగం, నష్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు చైర్మన్లుగా 105 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరివర్తన కార్యక్రమంలో భాగంగా 9 గ్రామాల ప్రజలను గంజాయి సాగు నుంచి మళ్లించి.. సంప్రదాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించినట్లు సీపీ వివరించారు.

అధైర్యపడొద్దు... ఆదుకుంటాం


అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి


అగ్నిప్రమాద బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

- తిమ్మాపురం అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి భరోసా
- బియ్యం, నిత్యావసరాలు పంపిణీ

అడ్డతీగల: ఎవ్వరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని తిమ్మాపురం అగ్నిప్రమాద బాధితులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి భరోసా ఇచ్చారు. బుధవారం ఇక్కడ అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తిమ్మాపురం వాల్మీకి వీధికి చెందిన నాలుగు కుటుంబాలను గురువారం ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గృహాలు, అందులోని కాలిపోయిన సామగ్రిని పరిశీలించారు. బొంకు జ్ఞానబాబు ఇంటిలో రూ.4 లక్షలు అగ్నికి ఆహుతి కాగా, సగం సగం కాలి మిగిలిన ఐదు వందల నోట్లను పరిశీలించారు. బాధితుల కుటుంబాల నేపథ్యం అడిగి తెలుసుకున్నారు. కనీసం రోజు గడవాలంటే ఒక్క వస్తువూ చేతికి చిక్కకుండా అగ్నిప్రమాదంలో సర్వం బూడిద అయిపోయాయని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా తగిన సహాయం మంజూరు చేయించి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అనంతరం ఒక్కో కుటుంబానికి వంద కిలోల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు, తహసీల్దార్ తాతారావు, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.కోటి 89లక్షలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 29 రోజులకు రూ.1,89,90,670 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై ఆలయ బేడా మండపంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 124.600గ్రాముల బంగారం, 14.565కిలోల వెండి లభించినట్టు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మరికొన్ని హుండీల ఆదాయాన్ని లెక్కించాల్సింది ఉండగా శుక్రవారం కూడా లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి


చికిత్స పొందుతున్న ప్రవళిక (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని వైకుంఠపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి గూటూరు ప్రవళిక (12) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ప్రవళిక సామర్లకోటకు చెందిన తన బంధువులు కొప్పిశెట్టి త్రినాథ రాజారమేష్ (25) మరో మహిళ అనురాధ వెంట మోటారుసైకిల్‌పై స్వగ్రామం చేబ్రోలు వెళుతూ ఆర్టీసీ బస్ ఢీకొట్టడంతో ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో రాజా రమేష్ అక్కడికక్కడే మరణించగా ప్రవళిక, అనూరాధకు గాయాలయ్యాయి. కాకినాడ జీజీహెచ్‌లో ప్రవళిక చికిత్స పొందుతూ మరణించింది. మండలంలోని వణకరాయిలోని అమ్మమ్మ ఇంటికి వేసవి సెలవులకు వచ్చిన ప్రవళిక బంధువుల వెంట తిరిగి స్వగ్రామం వెళుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలముకొంది.

పాడి దిగుబడిపై వడదెబ్బ!

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం సోమలింగపాలెం గ్రామానికి చెందిన యండమూరి సత్యనారాయణ 20 రోజుల క్రితం రూ. లక్షా 30 వేల విలువైన క్రాస్‌బ్రీడ్ హెచ్‌ఎఫ్ ఆవును కొన్నాడు. పది రోజుల క్రితమే ఈనింది. రోజుకు 30 లీటర్ల వరకు పాలు ఇచ్చేది. ఎండ తీవ్రత కారణంగా సోమవారం(15న) అస్వస్థతకు గురైంది. సమీప డెయిరీ డాక్టర్ వచ్చి పరీక్షించగా 109 జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది. వైద్యం అందించినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. దీంతో సదరు రైతు 1962కు కాల్ చేశాడు. వెంటనే సమీప సోమలింగపాలెం పశువైద్య సిబ్బంది డాక్టర్ జె.పద్మజ హుటాహుటిన అక్కడకు వెళ్లి అత్యవసర చికిత్సను అందించారు. దీంతో సాయంత్రానికి లేచి గడ్డి తినడం మొదలెట్టింది. ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఆవు కోలుకోవడంతో ఆయన ఆనందం వర్ణనాతీతం. దానికి కారణమైన పశువైద్య సిబ్బందికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

- హైబ్రిడ్ జాతి హెచ్‌ఎఫ్, ముర్రా, జెర్సీ ఆవులపై ఎక్కువ ప్రభావం
- జిల్లాలో ఇప్పటికే 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు
- 13 సంచార అంబులెన్స్‌ల ద్వారా వైద్యసేవలు

సాక్షి, అనకాపల్లి : గత రెండు వారాలుగా జిల్లాలో ఎండ తీవ్రత పెరిగింది. గతేడాది కన్నా ఈసారి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలు పాల దిగుబడిపై కూడా ప్రభావం చూపుతున్నాయి. పాడి పశువుల్లో గేదెల కన్నా ఆవుల్లోనే వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా హైబ్రిడ్ జాతి హెచ్‌ఎఫ్, ముర్రా, జెర్సీలాంటి ఎక్కువ పాల దిగుబడినిచ్చే ఆవులకు ఈ ఎండలు శరాఘాతంగా మారుతున్నాయి. ఆవులు వడదెబ్బకు గురికాకుండా పశు సంవర్ధక శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

అవగాహనతో అప్రమత్తం

జిల్లాలో 60–70 శాతం రైతులు వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. దీంతో వడదెబ్బ నుంచి పాడి పశువులను కాపాడుకునేలా పశుసంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వేసవిలో పాడి పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడంతోపాటు, శాశ్వతంగా చూడి అవకాశాలు కోల్పోవచ్చు. ఒక్కోసారి వాటి ప్రాణాలకు కూడా ముప్పురావొచ్చు. వడదెబ్బ ప్రభావంతో అస్వస్థతకు గురైతే తక్షణమే పశు సంచార అంబులెన్స్ నెంబర్‌కు గానీ, సమీప ప్రభుత్వ పశువైద్యశాలల్లో గానీ సంప్రదించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రుల్లో వైద్యులు, ఆర్‌బీకేల పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్లు, 13 సంచార అంబులెన్స్‌ల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. నడిచేటపుడు తూలుతాయి. శ్వాస రేటు పెరుగుతుంది. పశువు చాలా నీరసంగా కనపడుతుంది. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. నీటి కోసం ఆత్రంగా చూస్తుంటుంది. చర్మం పొడిబారుతుంది. పాడి పశువు అయితే పాల ఉత్పత్తి పడిపోతుంది. ఈ లక్షణాలుంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.


వైద్యం తరువాత హెచ్‌ఎఫ్ ఆవుకు గడ్డి తినిపిస్తున్న పాడిరైతు సత్యనారాయణ

ముందు జాగ్రత్తలు

పశువులకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి కమ్మలతో గానీ, ఎండు గడ్డితో గానీ కప్పాలి. మంచి నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి. కలుషిత నీరు తాగితే పారుడు వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. రోజులో కనీసం మూడు సార్లు పరిశుభ్రమైన నీటిని అందించాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలో మాత్రమే మేత కోసం విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకరజాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

జిల్లాలో పశు వైద్య సేవలు

- 2022-23లో 5,333 అత్యవసర వైద్య సేవలు. వీటిలో పశు సంచార అంబులెన్స్‌లు ద్వారా అందించినవే 453.
- 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా 17,484 నమూనాలను పరీక్షించారు.
- 2022-23కు గానూ.. 8,15,982 పశువులకు ప్రాథమిక చికిత్స అందించారు.
- 14,13,012 పశువులకు టీకాలు వేశారు.


వడ దెబ్బ తగిలిన ఆవుకు తడి గుడ్డలు, గోనెలు చుట్టి సాంత్వన కలిగిస్తున్న రైతు

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వేసవిలో పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన పశువును చల్లని నీటితో కడగాలి. ఐస్‌ను గుడ్డతో చుట్టి పశువు నుదుటిపై ఒత్తాలి. దగ్గరలో ఉన్న పశువైద్యుడిని సంప్రదించి సెలైన్లు పెట్టాలి. ఒక్కోసారి వడదెబ్బ తగిలిన పశువుకు బతికినంతకాలం పాల దిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

– ప్రసాదరావు, జేడీ, పశు సంవర్ధక శాఖ జేడీ, అనకాపల్లి

వచ్చే నెల 20 నుంచి మహా పాదయాత్ర

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

చింతూరు/ఎటపాక: పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందే వరకు దశల వారీగా పోరాటాలను చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా జూన్ 20 నుంచి మహా పాదయాత్ర చేపడతామన్నారు. గురువారం చింతూరులో ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో గతేడాది వరదలు సంభవించి నష్టపోయిన నిర్వాసిత ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయక కార్యక్రమాలు నిర్వహించడంలో విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ ఆదివాసీలకు తక్షణమే చెల్లించాలని, ఎటపాక మండలం తోటపల్లిలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ. లక్ష కోట్లు తగ్గించి కూలీల పొట్ట కొట్టేందుకు ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బప్పెన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులు లోత రామారావు, కుంజా సీతారామయ్య పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్

- ప్రారంభమైన సామర్థ్య పరీక్షలు
- జిల్లాలో వెయ్యికి పైగా బడి బస్సులు
- విద్యాసంస్థల తెరిచే నాటికి ఫిట్‌నెస్ తప్పనిసరి
- అప్పటికీ చేయించని పక్షంలో కేసులు నమోదు

సాక్షి, విశాఖపట్నం : బడి పిల్లలకు పరీక్షలు ముగిశాయి. వీరితో పాటు పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు వచ్చాయి. ఏడాదిలో పది నెలల పాటు విద్యార్థులను విద్యా సంస్థలకు తీసుకెళ్లిన స్కూలు బస్సులు ఇప్పుడు పరీక్షలకు సిద్ధమవుతున్నాయి. విద్యార్థినీ, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాలేజీలు, బడులు తిరిగి తెరుచుకునే సమయానికి ఈ బస్సులు విధిగా ఫిట్‌నెస్ (సామర్థ్య) పరీక్షలు పూర్తి చేసుకోవలసి ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి ఆయా విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడం మొదలు పెట్టాయి. జిల్లాలో వెయ్యికి పైగా స్కూలు బస్సులున్నాయి. ఆనందపురం మండలం గంభీరంలో ఉన్న రవాణా శాఖ మైదానానికి ఈ బస్సులు చేరుకుంటున్నాయి. అక్కడ రవాణా శాఖ సిబ్బంది వీటికి సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం బస్సు కండిషన్‌తో పాటు సీట్లు, లైట్లు, కిటికీల పక్కన గ్రిల్స్ వంటి వాటిని వీరు పరిశీలిస్తారు. అన్ని సవ్యంగా ఉన్నాయని నిర్ధారణ అయ్యాక ఆ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. పాఠశాలలు జూన్ రెండో వారం నుంచి పునఃప్రారంభమవుతాయి. జూనియర్, ఇంజినీరింగ్ కాలేజీలు ఒకింత ఆలస్యంగా తెరుచుకుంటాయి. అందువల్ల పాఠశాలల బస్సులను ముందుగా ఫిట్‌నెస్ కోసం ఆయా యాజమాన్యాలు పంపుతున్నాయి. విద్యాసంస్థలు తెరచుకునే నాటికి ఫిట్‌నెస్ చేయించుకుంటేనే ఆ బస్సును రోడ్లపైకి అనుమతిస్తారు. లేనిపక్షంలో రవాణా శాఖ అధికారులు ఆ బస్సును సీజ్ చేస్తారు.


స్కూలు బస్సుకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

బస్సులకు ఇవి తప్పనిసరి..

మోటార్ వాహన చట్టం 1988 ప్రకారం ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ తప్పనిసరి. దీంతో పాటు ఇతర నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అవి..

- స్కూలు బస్సు వయసు పరిమితి 15 ఏళ్లు దాటకూడదు
- డ్రైవరుకు ఐదేళ్లకు పైగా అనుభవం ఉండాలి
- స్కూలు బస్సు డ్రైవరుతో పాటు మరొక సహాయకుడు తప్పనిసరి
- సీట్ల దిగువన స్కూలు బ్యాగులు ఉంచుకునే సదుపాయం ఉండాలి
- యాజమాన్యం విధిగా బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు అందుబాటులో ఉంచాలి
- సీట్ల కిటికీల పక్కన హారిజాంటల్‌గా గ్రిల్స్ అమర్చాలి
- అత్యవసర ద్వారంతో పాటు అగ్నిమాపక పరికరాలుండాలి

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..



పాఠశాలలు, కాలేజీలు తెరచుకున్నాక రోడ్డెక్కే స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి. ఫిట్‌నెస్ చేయించుకోకుండా రోడ్లపైకి వచ్చే బస్సుల కోసం ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తిరిగే బస్సులను సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం. విద్యా సంస్థల యాజమాన్యాలు తమ బస్సులను సెలవులకు ముందే సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవాలి.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం